# శ్రీవారి సన్మానం

చెల్వారి
సీత రాజేశ్వర రావు



సరళ సంకోచంగా అడిగింది-
"నన్ను కూడ తీసుకెళ్ళరా? .... ఈమధ్య ఎక్కడికీ కదలక బోర్‌గా వుంది."

సహజానంద సెంటు రాసుకుని దగ్గరగా వచ్చాడు. సరళ గడ్డం పైకెత్తి, "నిన్నా! నా తోటా?" అంటూ ఘోరంగా నవ్వాడు. అంతగా ఎందుకు నవ్వాలో సరళకి అర్థం కాలేదు. తను జోకెయ్యలేదు కూడా తీసుకెళ్ళమంది.

"మన కాంబినేషన్ చూసి సభంతా ఘొల్లుమంటుంది. జోకర్‌లా నేను పళ్ళికిలించాలి. అంతకంటె అవమానం మరొకటి లేదు. సభ విశేషాలు వచ్చాక చెబుతానులే!" సహజానంద చెప్పులు వేసుకుని వెళ్ళిపోయాడు.

సరళ దిగాలుగా కిటికీ నుంచి రోడ్డును చూస్తూ కూర్చుంది. భర్త మాటలకి, ప్రవర్తనకి దిగులు వేసింది. "అమ్మా.... అలా వున్నావేం?" బేబీ పల్కరించినా ఆమె మాట్లాడలేదు.

సహజానందకి సరళ తెచ్చిన ఆస్థి, కట్నం పనికి వచ్చాయి. కాని ఆమె పనికి రావడం లేదు. సరళ లావుగా వుంటుంది భార్యని చెప్పుకోడానికి అతడికి నామోషీగా వుంది. ఎక్కడికీ తీసుకు వెళ్ళడు. పగలు-రాత్రి ఆకలి తీర్చడానికి తప్ప ఆమె వల్ల పని లేదు!

సహజానంద రచయిత. ఇవాళ అతనికి సన్మానం జరుగుతున్నది. భార్యగా అందులో భాగం పంచుకోవాలనుకోవడం ఆమె తప్పు కాదు.

రాత్రి రెండు గంటలకి సహజానంద వచ్చి తలుపు కొట్టాడు. సరళకి మెలుకువ వచ్చింది. కాని ఆమె లేచి వెళ్ళి తీయలేదు. బేబీని తీయమంది.

సహజానంద లుంగీ కట్టుకుని, జగ్‌లోని మంచినీళ్ళు త్రాగి సిగరెట్ వెలిగించాడు. "సరళా! పడుకున్నావా?" దగ్గరకి చేరాడు. సరళ డబుల్ కాట్ మీద దూరంగా జరిగింది.

సహజానంద సన్మానం విశేషాలు చెబుతూ, ఆమె చీర సవరించాడు. ఇప్పుడు భార్య అనాకారితనం గుర్తు రావడంలేదు, ఆడతనం గుర్తు వస్తోంది. సరళ ముఖం చిట్లించి, "వంట్లో బాగాలేదు" అంటూ క్రింద చాప వేసుకుని పడుకుంది.

తనని నిర్లక్ష్యం చేస్తూండటం, కేవలం అవసరానికి మాత్రం వుపయోగించుకోవడం- ఆమెకి మంటగా వుంది. 'భార్య కథానాయికలా వుంటే తప్ప పనికి రాదా?' సరళకి ఎంతకీ నిద్ర పట్టడంలేదు. భర్త మీద కోపం ద్విగుణీకృతమవుతోంది. 'ఈ బాధకి జవా

పేమిటి?' అని ఆలోచిస్తుంది.

పది రోజులు గడిచాయి. ఓ ఆదివారం మధ్యాహ్నం సహజానంద గుర్రుపెట్టి నిద్ర పోతున్నాడు. కాలింగ్ బెల్ మోగడంచూసి భర్తని లేపింది. సహజానంద ఆవలిస్తూ డ్రాయింగ్ రూంలోకి వచ్చాడు.

నలభై యేళ్ళ వ్యక్తి ఫిల్టర్ సిగరెట్ కాలుస్తూ అక్కడ కూర్చున్నాడు. లాల్చీ పైజమా వేశాడు. లోపలకి వచ్చినా కూలింగ్ గ్లాసెస్ తీయలేదు.

"నమస్కారం కవిగారూ! నన్ను శతమానం అంటారు. విజయవాడలోని కళా కేంద్రం సెక్రటరీని. మా సంస్థ మీకు సన్మానం చేయాలనుకుంటోంది."

సహజానందకి ఆనందంవచ్చినా, దాన్ని దాచుకుంటూ, "నాకు పాఠకుల ఆదరణే సన్మానం! ఇలాంటి ప్రచారాలు నా కిష్టముండవు" అన్నాడు.

"ఏదో మా తృప్తి కోసం! పైగా ఆ చుట్టు ప్రక్కల మీ పాఠకులు మీతో ముఖాముఖి మాట్లాడాలని ఉవ్విళ్లూరుతున్నారు."

వెయ్యి నూట పదహార్లు, శాలువా, దారి ఖర్చులు వస్తాయని శతమానం మాటలు బట్టి గ్రహించి ఒప్పుకున్నాడు.

"మూడో తారీఖున వీలుగా వుంటుందా మీకు?"

"మీ కోసం చేసుకోవాలి. చరిత్రాత్మక నవల రాస్తున్నాను. ఎక్కడా ఖాళీ దొరకడం లేదు. రెండు మూడు సభలకి పిలిచినా పోలేదు. దూరాన్నుంచి వచ్చారు, మిమ్మల్ని నిరాశ పరచకూడదని ఒప్పుకున్నా!" డబ్బా వాయించాడు.

"అది మా అదృష్టం. పనిలో పని- ఆ రోజు మీ పుస్తకాల ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేస్తున్నాం. మీ రచనలు వుంటే యివ్వండి. బాగా అమ్ముడుపోతాయి!" శతమానం చెప్పాడు.

సహజానంద మంచి బేరం దొరికిందని మురిసిపోయాడు.

సహజానంద లోపలకి వెళ్ళి బేబీచేత కాఫీ పంపాడు.

ఆ మధ్య స్వంతంగా వేసి మిగిలిపోయిన "రగిలే ప్రేమ"; "మమతల బందీ"; "నీకు నేను అంకితం" నవలల కాపీలు తలో పదీ యిచ్చాడు.

"అమ్మకం డబ్బు మీదే" అన్నాడు శతమానం.

సహజానంద మరో పదేసి కాపీలు యిచ్చాడు. శతమానం వెళ్ళిపోయాడు. "ఎలాంటి

సన్మానం జరుగుతోందో చూశావా?" అంటూ వంటింట్లోకి వెళ్ళాడు.

"మీకు సన్మానాలు అలవాటే కదా!" సరళ పకోడీలు వేయడం అపి అదోలా నవ్వింది.

"నీకూ రావాలని వుంది. అవునా...రా... మన కీర్తి మొద్దువు గాని."

"వద్దులెండి. నేను వస్తే మీకు అవమానం."

సహజానంద విజయవాడ సన్మానానికి వెళ్ళవల్సిన రోజు రానే వచ్చింది. రెండు గంటల డీలక్స్‌కి టిక్కెట్టు తెచ్చుకొన్నాడు. భోజనం చేసి బట్టలు వేసుకునేసరికి బస్ టైం అయిపోయింది. వాచీకోసం వెతికాడు. వాచీ టేబుల్ క్రిందపడి అద్దం పగిలి, ఆగిపోయి వుంది. "ఉంగరం ఏది?" సరళని అడిగాడు.

"కంసాలికి మెరుగు పెట్టడానికి ఇచ్చాను. వాడు ప్రొద్దుటే ఊరికి వెళ్ళిపోయాట్ట. ఇప్పుడే బేబీని పంపాను."

"ఛీ- వెధవ సంత!" విసుగ్గా రిక్షా ఎక్కాడు.

విజయవాడ బస్‌స్టాండ్‌లో దిగేసరికి ఐదయింది. శతమానం కోసం చూశాడు. అరగంటయినా రాలేదు. ఆటోలో దుర్గా అగ్రహారం బయలుదేరాడు. కళాకేంద్ర ఆఫీసు నిశ్శబ్దంగా వుంది. సన్మానం మరో చోట ఏర్పాటుచేసి వుంటారని భావించి లోపలికెళ్ళాడు.

వరండాలో టేబిల్ మీద కాళ్ళు పడేసి ఓ ముసలాయన చుట్ట కాల్చుకుంటున్నాడు. సహజానంద ఆయన్ని పిలిచాడు.

"ఎవరు మీరు? ఏం కావాలి?" విసుగ్గా అడిగాడు.

సహజానందకి కోపం వచ్చింది. "పిలిచి అవమానం చేస్తారా? ఇదిగో మీరు పంపిన ఆహ్వానం."

అది చూసి ముసలాయన నవ్వాడు. "ఇది మేం పంపినది కాదు. కళాకేంద్రం మంత్రులకి, సినీతారలకి మాత్రమే సన్మానం చేస్తుంది. కవులకి కాకరకాయలకి మేం సన్మానం చెయ్యం."

"చెయ్యనివారు ఎందుకు పిలవాలి? శతమానాన్ని పిలవండి అడుగుతాను."

"ఇక్కడ శతమానాలు, సహస్రమానాలు ఎవరూ లేరు. మిమ్మల్ని ఎవడో మోసం చేశాడు. వాడికి డబ్బు కూడా ఇచ్చారా?" ముసలాయన వెటకారంగా నవ్వాడు.

సహజానందకి ఆవేశం ముంచుకు వచ్చింది. 'కాని ఏం చెయ్యడం? ఎవర్ని అనడం?' ముసలా

యన్ని ఏం అడిగినా ఉపయోగం లేదని నీరసంగా బయల్దేరాడు. 'ఎవడో తనని ఫూల్ చేసి పుస్తకాలు పట్టుకుపోయాడు.' రిక్షాలు కన్పించ లేదు. ఏలూరు రోడ్డు దాకా నడిచి వచ్చేసరికి ఆయాసం వచ్చింది.

హోటల్లోకి వెళ్ళాడు. వాష్ బేసిన్ దగ్గర ముఖం కడుక్కొని రుమాలుకోసం జేబులో చెయ్యి పెట్టాడు. రుమాలు, పర్స్ లేవు. జేబు చిరిగి వుంది.

'పర్సులో 300 రూపాలుండాలి! చొక్కాలో రూపాయి ఎనభై పైసల చిల్లర వుంది. కొత్త జేబుకి చిరుగు ఎలా వచ్చింది?"

వెళ్ళడానికి దారి కనిపించలేదు. 'కొత్త చోటు. ఎవర్ని అడగడం? వాచీ వుంగరం వున్నా తాకట్టు పెట్టి డబ్బు తీసుకోవచ్చు. అవీ లేవు. ఛ ఛ- అన్నీ అపశకునాలే!' సహజానంద టీ త్రాగి బస్‌స్టాండ్‌లో అటు ఇటు తిరుగుతున్నాడు- ఎవరయినా కనిపిస్తారని.

రాత్రి పన్నెండు గంటలైంది. ఆకలి అలసటతో సహజానంద పిచ్చివాడిలా వున్నాడు. ఎదురు చూపి విసుగుపుడుతోంది.

హైదరాబాద్ నుంచి వచ్చిన అమలాపురం డీలక్స్‌లో తుకారాం కనిపించాడు. తుకారాం టీకోసం దిగాడు. స్నేహితుడ్ని చూడగానే ప్రాణం లేచి వచ్చింది. సిగ్గు విడిచి బాధ చెప్పుకున్నాడు.

"నేను మామగారి ఇంటికి పోతున్నా. ఇక పర్సు అవసరం వుండదని ఏం తీసుకురాలేదురా! చిల్లర మాత్రం వుంది."

ఉసూరుమన్నాడు సహజానంద. బెంచీపై కూర్చున్నాడు. రాత్రయినా బస్‌స్టాండ్ రద్దీగా వుంది. చేతి సంచీ తలక్రింద పెట్టుకుని పడుకున్నాడు. నిద్ర పట్టేసింది.

బస్ హారన్లతో తెల్లవారు తూండగా మెలకువ వచ్చింది. సంచీలోని టవల్ తీసుకుని ముఖం తుడుచుకున్నాడు. అందులో డైరీ కనబడింది. డైరీలో యాభై నోటు వుంది.

సహజానంద ఆనందం ఎలా వర్ణించడం?

హోటల్లో టిఫిన్ చేసి బస్ ఎక్కాడు. ఇంటికి వచ్చేసరికి ఒంటి గంటయింది. భోజనం చేసి పడుకున్నాడు.

సరళ లేవాక టీ ఇస్తూ. "సన్మానం ఎలా జరిగిందండీ?" అడిగింది.

చెప్పాడు.

'బాగా అయింది' అనుకుంది. శతమానం సరళ పంపిన నాటకాల రాయుడు. తనని తీసుకెళ్ళడంలేదని ట్రిక్ ప్లే చేసింది.

అప్పట్నుంచి సహజానందకి సన్మానాలంటే భయం పట్టుకుంది. ✱